
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 12 జనవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.107	155	177
సూర్యాపేట	రూ.100	150	170
నల్లగొండ	రూ.109	158	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 17.4

సంక్రాంతి సందడి

- ముగ్గులతో పాఠశాలల్లో సందడిచేసిన విద్యార్థులు
- పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో ఇంటిబాట



తిరుమలగిరి (సాగర్)లో పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

కొండమల్లేపల్లి బస్టాండ్‌లో రద్దీ

తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పండుగల్లో ప్రధానమైన సంక్రాంతి సందడి ప్రారంభమైంది. మూడు రోజులపాటు కొనసాగే ఈ వేడుకలకు అంతా సిద్ధమయ్యారు. ఇప్పటికే పిండి వంటల తయారీలో నిమగ్నమైన ఆడపడుచులు వివిధ రకాల వంటకాలు చేస్తున్నారు. ఇక చిన్నారులు గాలిపటాలతో బిజీబిజీగా గడుపుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు నేటి నుంచి సెలవులు ప్రకటించగా, గురువారం ఆయా పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు జరిగాయి. విద్యార్థుల డ్యాన్స్‌లు, కేరింతలతో సందడి వాతావరణం నెలకొంది. బతుకుదెరువు, ఉపాధి, విద్యావకాశాల కోసం నగరాలు, పట్టణాల్లో నివసించే కుటుంబ సభ్యులు పల్లెలకు చేరుతున్నారు.

ఊరెళ్తున్నారా.. జర భద్రం
ప్రజలకు పోలీసుల సూచనలు ●7లో..



నల్లగొండలోని ఓ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

పార్లమెంటు ఎన్నికలకు హిందుత్వ ఎజెండా



- రామాలయ ప్రారంభాన్ని వినియోగించుకోవాలని నిర్ణయం
- పట్టభద్రుల ఎన్నికలకు ఓటర్ నమోదుపై నజర్

రానున్న పార్లమెంటు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు హిందుత్వ ఎజెండాతోనే పార్టీ కార్యక్రమాలు ఉండాలని, ఆ దిశగా ఓటర్లను ఆకర్షించాలని బీజేపీ రాష్ట్రకమిటీ కమిటీ నిర్ణయించింది. ఆసక్తిగల నేతలు విస్తృతంగా కార్యక్రమాల భారాన్ని మోసి టికెట్లు సాధించుకోవాలని, తద్వారా పార్టీని, వారి రాజకీయ భవిష్యత్తును సుస్థిరం చేసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా కీలక నేతలకు సూచించింది. ఈ నేపథ్యంలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం నల్లగొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కీలక నేతలతో సమావేశమయ్యారు. త్వరలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీవీఎస్.ప్రభాకర్ నేతృత్వంలో సమావేశం జరగనుంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

నల్లగొండ పార్లమెంటు పరిధిలోని రాష్ట్ర ఆఫీస్ బేరర్స్, జిల్లా ఆఫీస్ బేరర్స్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, తదితర కీలక నేతలు సుమారు 70మందితో బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం సుదీర్ఘ సమావేశం జరిగింది. పార్లమెంట్ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా పలు అంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి. నల్లగొండ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసేందుకు ఎంత మంది ఆసక్తిగా ఉన్నారని ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి ఆరా తీయగా, సుమారు ఏడు నుంచి ఎనిమిది మంది సిద్ధమని ప్రకటించారు. ఫిబ్రవరి మొదటివారంలో పార్టీ అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని, ఏప్రిల్ చివరకు పోలింగ్ పూర్తవుతుందని, ఆ మేరకు నాయకత్వం ప్రజల్లోకి వెళ్లాలని, అధిష్ఠానం నిత్యం కార్యక్రమాలు ఇస్తూ వెళ్తుందని, ఆసక్తిగల నేతలు దీన్ని వినియోగించుకొని రాజకీయ భవిష్యత్‌ను సుస్థిరం చేసుకోవాలని వారికి చింతల సూచించారు.

రామజన్మభూమిపై ఆశలు

రామజన్మభూమి అయోధ్యలో ఈనెల 22న రామాలయం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో కార్యక్రమాలు నిర్వహించాలని, ఓటర్ల మనసులో బీజేపీ స్థానాన్ని సుస్థిరం చేయాలని ఆ పార్టీ యోచిస్తోంది. 22న రామాలయం ప్రారంభం నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని అన్ని ప్రధాన పట్టణాల కూడళ్లలో భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేసి ప్రసారం చేసి రామాలయ నిర్మాణం బీజేపీ సాధించిన విజయంగా చూపించాలని చూస్తోంది. ఈ కార్యక్రమాన్ని స్థానిక నాయకులే నిర్వహించాలని, అనుసంధానంగా అదే రోజు నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాల పరిధిలోని అన్ని దేవాలయాలను స్వచ్ఛ ఆలయ్ పేరుతో పరిశుభ్రం చేసి పూజలు చేయించాలని, గ్రామగ్రామాన దీన్ని నిర్వహించాలని అధిష్ఠానం ఆదేశించింది. అదే రోజు దేవాలయాల్లో దీపాలు వెలిగించాలని, పూజలు నిర్వహించాలని, పట్టణాల్లో ప్రధాన కూడళ్లలో 5వేల దీపాలతో శోభాయాత్ర నిర్వహించాలని మార్గనిర్దేశం చేసింది. ఈ తరహాలో చేపట్టాల్సిన ఆరేడు కార్యక్రమాలను నల్లగొండ సమావేశానికి హాజరైన కీలక నేతలకు ఇన్‌చార్జి వివరించారు. దేవాలయాల వద్ద బీజేపీ జెండాలు లేకున్నా కాషాయ జెండాలు, పార్టీ కీలక నేతలు కార్యక్రమాలు నిర్వహిస్తే ఇది బీజేపీ కార్యక్రమంగా ప్రజల్లోకి వెళ్తుందని భావిస్తున్నారు. రామాలయ అక్షింతల కార్యక్రమం సక్సెస్ కావడంతో ఆదే తరహాలో ఇతర కార్యక్రమాల నిర్వహణకు నిర్ణయించింది. అయోధ్యకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రైళ్లను నడుపుతోంది. వాటిలో వెళ్లాలనుకునే వారి నుంచి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున వసూలు చేసి 75శాతం మంది తటస్థులు, 25శాతం బీజేపీ నేతలు ఉండేలా చూడాలని పార్టీ స్థానిక నేతలను ఆదేశించింది. ఈ కార్యక్రమం నిరంతరం సాగనుంది.

జిల్లా అధ్యక్షుల మార్పు

కొందరు జిల్లా అధ్యక్షులు పార్టీ మారడం, బాధ్యతలు నిర్వహించడం తమ వల్ల కాదని తెగేసి చెప్పడం, కొందరి పనితీరు పూర్తిగా అధమంగా ఉండటంతో పెద్ద సంఖ్యలో జిల్లా అధ్యక్షులను మార్చాలని రాష్ట్ర పార్టీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగకు ముందే కొత్త అధ్యక్షుల జాబితా వెలువడుతుందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ఏ మేరకు మార్పు ఉంటుందనేది వేచి చూడాల్సి ఉంది. కాగా, నల్లగొండ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు నాగం వర్షిత్‌రెడ్డి, లాలునాయక్ ఆసక్తిగా ఉన్నారు. వీరు ఆసక్తిగా ఉన్నారా? లేదా? అని తెలుసుకునేందుకు రేసులో ఉన్న ఆయా జిల్లాలోని నేతలకు రాష్ట్ర పార్టీ నుంచి ఇప్పటికే ఫోన్లు చేసి అభిప్రాయాన్ని సేకరించినట్టు సమాచారం.


తిరుపతిలో సేవ మాదిరిగా అయోధ్యలోనూ సేవ చేసేందుకు పార్లమెంట్ పరిధిలో 50 మందిని సిద్ధం చేసి, వారు అక్కడే ఉండేందుకు వసతులు కల్పించనున్నారు. రామాలయం ప్రారంభానికి కాంగ్రెస్ దూరంగా ఉంటుందని ఇప్పటికే ప్రకటించింది. ఈ ప్రకటనను ఆసరా చేసుకొని కాంగ్రెస్ హిందుత్వ వ్యతిరేక పార్టీ అనే ప్రచారాన్ని విస్తృతం చేయాలని పార్టీ అధిష్ఠానం స్థానిక నేతలకు సూచించింది.

పోటీదారుల సమాచారం సేకరణ

ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కనబరిచే వారిలో మన్నెం రంజిత్‌యాదవ్, నాగం వర్షిత్‌రెడ్డి, నూకల నర్సింహారెడ్డి, జితేందర్ గుప్తా, బండారు ప్రసాద్, లాలునాయక్‌తోపాటు మరికొందరు ముందుకు వచ్చారు. అదేవిధంగా నల్లగొండలో ప్రముఖ వైద్యుడు మాత్రునాయక్ సైతం బీజేపీ ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు సమాచారం. పార్టీ పెద్దలు ఆయనతో సంప్రదింపులు చేసినట్టు తెలిసింది. పార్లమెంట్ స్థానం పరిధిలో 4లక్షలకుపైగా ఎస్టీ ఓటర్లు ఉన్నారు. మాత్రు 25 ఏళ్లుగా వైద్యవృత్తిలో స్థానికంగా ఉండటం, మిర్యాలగూడ నియోజకవర్గ వాసి కావడం, ఉద్యోగరీత్యా నల్లగొండ, దేవరకొండ నియోజకవర్గాల్లో పనిచేయడం ఆయనకున్న సానుకూల అంశాలు. ఇక ఏకైక బీసీ అభ్యర్థిగా రంజిత్ యాదవ్ ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు రంగం సిద్ధమతున్న వేళ పార్టీ నేతలు మిత్రులు, బంధువులను ఓటర్లుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించాలని చింతల సూచించారు. విశ్వకర్మ యోజన కింద వృత్తి పనివారికి రుణాలు ఇప్పించే కార్యక్రమం, ఈ పథకం గడువును పెంచిన అంశం సైతం చర్చకు వచ్చింది. యువత, మహిళా ఓటర్లపై ప్రధానంగా దృష్టిసారించి ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించేందుకు నిర్ణయించారు.

సాగర్ బౌద్ధ క్షేత్రం అద్భుతం

జమ్ముకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తి తాషి రబ్‌స్థాన్



బుద్ధవనంలో బుద్ధుడి పాద నమూనాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న తాషి రబ్‌స్థాన్ దంపతులు

నాగార్జునసాగర్, జనవరి 11: నాగార్జునసాగర్‌లో అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రం అద్భుతమని జమ్ముకశ్మీర్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ తాషి రబ్‌స్థాన్ అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం సాగర్ విజయవిహార్‌కు వచ్చిన ఆయన రాత్రి బస చేశారు. గురువారం ఉదయం పర్యాటక శాఖ లాంచీలో జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు చేరుకున్నారు. అక్కడి మ్యూజీయాన్ని తిలకించి, హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనానికి చేరుకున్నారు. బుద్ధుడి పాదాలకు సతీసమేతంగా పుష్పాంజలి ఘటించారు. ధ్యాన మందిరంలో కాసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జమ్ములోని లడఖ్ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో బౌద్ధులు సాగర్‌కు వస్తుంటారన్నారు. తాను కూడా బౌద్ధ ఆరాధకుడినేనని తెలిపారు. ఇక్కడి బుద్ధవనం తనను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. బుద్ధుడి బోధనలు ప్రశాంత జీవన విధానానికి దోహదపడతాయన్నారు. వారికి సాగర్ విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు. ఆయన వెంట డీటీ శరత్‌చంద్ర, ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి, బుద్ధవనం సూపర్‌వైజర్ విష్ణు, నిడమనూరు కోర్టు సిబ్బంది కాలిక్ ఉన్నారు.

చెంచులు పథకాలను వినియోగించుకోవాలి

జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమాధికారి రాజ్‌కుమార్

నేరేడుగొమ్ము, జనవరి 11: చెంచులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో తిమ్మాపురం, గన్నేర్లపల్లి చెంచులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే ప్రతీ పథకం గిరిజనులకు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు ఆధార్ కార్డు పొందలేని చెంచుల కోసం ఆధార్‌కార్డులను అందించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. దీన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బాలు, నేరేడుగొమ్ము, చందంపేట ఎంపీడీవోలు ఝాన్సీ లక్ష్మీబాయి, రాములునాయక్, వైస్ఎంపీపీ ఆరేకంటి ముత్యాలమ్మ, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు లింగయ్య, పాల్గొన్నారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేయించాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల రామచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

రామగిరి, జనవరి 11: కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు, భూమాఫియాపై సీబీఐతో విచారణ చేయించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆరోపించిన కాంగ్రెస్ సీబీఐతో ఎందుకు విచారణ చేయించడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుంటే కాంగ్రెస్‌ను ప్రజా కోర్టులో నిలబెడతామన్నారు. ఆరు గ్యారెంటీల అమలుకు రూ.85వేల కోట్ల వ్యయం అవుతుందని, అందుకు నిధులు ఎక్కడ నుంచి తెస్తారో శ్వేతపత్రం విడుదల చేయలన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సీబీఐ విచారణ గురించి ప్రశ్నిస్తే మంత్రి ఉత్తమ్ మాట్లాడిన తీరు సరైనది కాదన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు ఎంత సమయంలో పూర్తి చేస్తారో మంత్రులు చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడిందనే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. తెలంగాణ అభివృద్ధికి తొమ్మిదేళ్లలో రూ.9లక్షల కోట్లు కేంద్రం ఇచ్చిందన్నారు. రైతు బంధు కోసం బ్యాంకులో ఉన్న రూ.7,700కోట్లు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. నెలరోజులు దాటినా రైతుబంధు ఇవ్వకుండా ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో సమాధానం చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీల అమలు ఎన్నికల కోడ్ వచ్చే వరకు జాప్యం చేయొద్దన్నారు. సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధరెడ్డి, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల నర్సింహారెడ్డి, గార్లపాటి జితేందర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణ, నాగం వర్షిత్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక సాంబయ్య, బాబా, నివేదితరెడ్డి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

డీడీలు తీసిన వారికి గొర్రెలు పంపిణీ చేయాలి

నల్లగొండ టౌన్, జనవరి 11: సబ్సిడీ గొర్రెల కోసం ఎనిమిది నెలల క్రితం డీడీలు తీసిన వారికి గొర్రెలు పంపిణీ చేయాలని, లేదా డబ్బు వాపసు ఇవ్వాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బండా శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం తిప్పర్తి మండలం సర్వారం గ్రామానికి చెందిన సుమారు 60మంది గొర్రెల పెంపకందారులతో కలిసి పశుసంవర్ధక శాఖ జేడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అప్పు చేసి డీడీ తీసి ఎదురుచూస్తున్న గొల్ల కురుమలు గొర్రెలు పంపిణీ చేస్తారా లేదా అని ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అవిశెట్టి శంకరయ్య, మన్నెం భిక్షం, కుంటి గొర్ల నాగరాజు, నాగయ్య, సీనయ్య, యాదయ్య, జానయ్య, యాదగిరి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట | మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ | మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఆట్రియమ్ - గచ్చిబౌలి | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్2 నోమ - మల్లాపూర్ | మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ | టివోలి - సికింద్రాబాద్
జిఎస్ఎమ్ - మదీనగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్- అత్తాపూర్ | జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ | మరియు
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ | మీ అభిమాన థియేటర్లలో

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట | మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ | మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఆట్రియమ్ - గచ్చిబౌలి | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్2 నోమ - మల్లాపూర్ | మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ | టివోలి - సికింద్రాబాద్
జిఎస్ఎమ్ - మదీనగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్- అత్తాపూర్ | జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ | మరియు
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ | మీ అభిమాన థియేటర్లలో

ఘనంగా లక్షపుష్పార్చన

నార్కట్‌పల్లి, జనవరి 11: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమావాస్య తిథిని పురస్కరించుకుని గురువారం రాత్రి లక్షపుష్పార్చన వేడుకను ఘనంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకుని గుట్టపై నిద్ర చేసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తొలత పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ప్రధానాలయం నుంచి మంటపం వరకు భక్తుల శివన్నామస్మరణల మధ్య పల్లకిసేవతో తీసుకువచ్చారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చకులు సురేశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ వేదపండితుల మంత్రోచ్ఛారణలు, సన్నాయి వాయిద్యాల మధ్య స్వామి వారి లక్ష పుష్పార్చన వేడుకను ఆద్యంతం కన్నుల పండువగా నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల చెంత పూజలందుకున్న పుష్పాలను పవిత్రంగా భావించిన భక్తులు వాటిని తీసుకునేందుకు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


లక్షపుష్పార్చన వేడుక

తండ్రిని చంపిన కుమారుడికి జీవితఖైదు

సూర్యాపేటలీగల్, జనవరి 11: తండ్రిని చంపిన కుమారుడికి జీవిత ఖైదు విధిస్తూ సూర్యాపేట ప్రిన్సిపల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని జమ్లాకుంట తండాకు చెందిన నూనావత్ స్వామి తన భార్యతో వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో 2020 మార్చి 28వ తేదీన మధ్యాహ్న సమయంలో నిద్రిస్తున్న తండ్రి నూనావత్ బిక్యా(70)ను మంచం పట్టెతో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన బిక్యాను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. బిక్యా మరో కుమారుడు నూనావత్ పాండు ఫిర్యాదు మేరకు పెన్‌పహాడ్ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సూర్యాపేట సీఐ విఠల్ రెడ్డి, ఎస్ఐ. రంజిత్‌రెడ్డి అభియోగ పత్రం దాఖలు చేశారు. 10 మంది సాక్షులను విచారించిన కోర్టు నిందితుడు నునావత్ స్వామికి జీవితఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. గతంలో నిందితుడు స్వామికి భార్యను హత్యచేసిన కేసులో జీవితఖైదు విధించారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య వాదించారు.

సీఎం పీఆర్‌వోగా శ్రీధర్ నియామకం

ఆలేరు రూరల్, జనవరి 11: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాకకు చెందిన మామిడాల శ్రీధర్‌ను సీఎం పీఆర్‌వోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని కొలనుపాకకు చెందిన శ్రీధర్ గతంలో ఆయన రేవంత్‌రెడ్డి వద్ద పీఏగా పనిచేశారు. కాంగ్రెస్ విజయం సాధించి రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో శ్రీధర్‌ను తన పీఆర్‌వోగా నియమించుకున్నారు. తమ గ్రామానికి చెందిన శ్రీధర్ సీఎం పీఆర్‌వోగా నియామకం కావడం పట్ల కొలనుపాక సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు గ్రామస్థులు హర్షం ప్రకటించారు.


శ్రీధర్

నాగార్జునసాగర్‌లో కరోనా కలకలం

● *22 మందికి నిర్ధారణ పరీక్షలు.. ఒకరికి పాజిటివ్*

నాగార్జునసాగర్, జనవరి 11: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో రెండేళ్ల తర్వాత కరోనా కలకలం సృష్టించింది. గురువారం స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రిలో 22మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా ఓ మహిళకు పాజిటివ్‌గా నమోదైనట్లు ఆసుపత్రి సీఎంవో డాక్టర్ భానుప్రసాద్‌నాయక్ తెలిపారు. ఆమెకు కరోనా కిట్ అందజేసి హోం క్వారంటైన్‌లో ఉండాలని సూచించినట్లు చెప్పారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల ఫలితంగా జలుబు, జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నవారి సంఖ్య గత వారం రోజులుగా పెరిగింది. దీనికి తోడు ఇతర ప్రాంతాల నుంచి సాగర్‌కు పర్యాటకుల సంఖ్య పెరగడంతో కరోనా లక్షణాలున్నవారు స్వచ్ఛందంగా పరీక్ష చేయించుకోగా మళ్లీ కరోనా కలకలం రేపింది.

ఇటు రద్దీ.. అటు అప్రమత్తత

● సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్తున్న ప్రజలు
● సమాచారం ఇవ్వాలని పోలీసుల సూచన

చౌటుప్పల్ టౌన్, జనవరి 11: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం నుంచి వాహనాల రద్దీ పెరిగింది. హైదరాబాద్‌లోని ఆంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజలు సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో పట్టణంలోని జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. జాతీయ రహదారిపై ఉన్న జంక్షన్ల వద్ద పాదచారులతో పాటు ద్విచక్రవాహనదారులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జంక్షన్ల వద్ద వాహనాలను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులను అదనంగా నియమించారు.


ఇంటికి పయనం


నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి బస్టాండ్ వద్ద బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

సొంతూళ్లకు విద్యార్థులు

సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ప్రభుత్వ బాలికల గురుకుల విద్యాలయం, కస్తూర్బా విద్యాలయం, మోడల్ స్కూల్ తదితర విద్యా సంస్థలకు చెందిన సుమారు వెయ్యి మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి సొంతూళ్లకు పయనమయ్యారు. ఈ నెల 12నుంచి 17 వరకు సెలవులు ఉండగా, 18న విద్యాలయాలు పునఃప్రారంభం కానున్నాయి. జాతీయ రహదారిపై వెలుతున్న బస్సుల్లో ప్రయాణికులు కిక్కిరిసి ఉండడంతో విద్యార్థులు గంటల తరబడి వేచి ఉన్నారు. ప్రైవేట్ వాహనదారులు చార్జీలు పెంచి ప్రయాణికులను నిలువు దోపిడీ చేశారు.

ఉప్పల్‌లో తాత్కాలికంగా బస్టాప్‌ల మార్పు

భువనగిరి టౌన్: సంక్రాంతి రద్దీని పురస్కరించుకొని హైదరాబాద్ ఉప్పల్ వద్ద బస్‌స్టాప్‌లను తాత్కాలికంగా మార్చినట్లు ఆర్టీసీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పల్ నుంచి యాదగిరిగుట్ట, తొర్రూరు వైపు వెళ్లే బస్సులు ఉప్పల్‌లోని ప్రస్తుత బస్‌స్టాప్‌లో బదులు లిటిల్ ఫ్లవర్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాప్‌లో ఆగుతాయని తెలిపారు. ఈ మార్గాల్లో ఉప్పల్ వరకు ప్రయాణించే బస్సులు కూడా అక్కడి నుంచి తిరుగు ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. వరంగల్ వైపు వెళ్లే బస్సులు మాత్రం ప్రస్తుతం బస్టాప్‌లోనే ఆగుతాయని తెలిపారు. పండుగ రద్దీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాల నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో బస్టాప్‌ల మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. మారిన బస్టాప్‌లతో ప్రయాణికులు అయోమయానికి గురి కావొద్దని సూచించారు.


భువనగిరిలో సీటు కోసం కుస్తీ


చౌటుప్పల్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు


భువనగిరిలో బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు


భువనగిరిలో పాఠశాల నుంచి ఇళ్లకు బయలుదేరిన విద్యార్థులు

ఇంట్లో నగలు, నగదు దాచి ఊర్లకు వెళ్లొద్దు

చిట్యాల రూరల్: సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలని నార్కట్‌పల్లి సీఐ టి. మహేష్ సూచించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులో గురువారం చిట్యాల ఎస్ఐ ఇరుగు రవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇంట్లో విలువైన వస్తువులు ఉంచవద్దని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదని సూచించారు. బీరువా తాళాలను ఇంట్లో పెట్టకుండా తీసుకెళ్లాలని సూచించారు. బంగారం, నగలు, నగదును ఇంట్లోని బీరువాల్లో ఉంచి ఊర్లకు వెళ్లొద్దని బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని, లేనిపక్షంలో తమ వెంట తీసుకెళ్తే జాగ్రత్తగా ఉంటాయన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కూడా సమాచారాన్ని ఇవ్వాలన్నారు. ఇంటి చిరునామా, ఫోన్ నెంబరు చెబితే ఆ ఇళ్లపై నిఘా ఉంచుతామని పేర్కొన్నారు. ఇంట్లో లైట్లు వేసి ఉంచాలని, టైమర్‌తో కూడిన లైట్లను ఏర్పాటు చేసుకోవాలని సెక్యూరిటీ అలారమ్‌లు, హోం సెక్యూరిటీ సిస్టంలు మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయని వాటిని ఏర్పాటు చేసుకుంటే రక్షణగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

ప్రజలకు పోలీసుల సూచనలు


భువనగిరిలో ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న పట్టణ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కృష్ణ

భువనగిరి టౌన్: పండుగల కోసం ఊర్లకు వెళ్లే వారి కోసం పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండానే ఊర్లకు వెళ్లొద్దని సూచిస్తున్నారు. దొంగలు సంబంధిత ఇళ్లను టార్గెట్ చేసే ప్రమాదం ఉంటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో దొంగతనాల నివారణకు, చోరీ జరిగితే నష్ట శాతాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు విస్తృత ప్రచారం చేపట్టారు. ఆటోలు, తదితర వాహనాలకు మైక్‌లు బిగించి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాలో హెచ్చరికల పోస్టులను పెడుతున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు బిగించుకుంటే మరింత మంచిదని భువనగిరి పట్టణ పోలీసులు సూచిస్తున్నారు.

● ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేవారు విలువైన వస్తువులు, నగదు ఇంట్లో పెట్టవద్దు. బ్యాంక్ లాకర్, లేదా భద్రంగా ఉన్నచోట దాచుకోవాలి.

● ఇంటి ముందు ద్వారానికి సెంట్రల్ లాక్ వేసి వెలుపలి నుంచి గడియ పెట్టవద్దు.

● ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు తాళం కనిపించకుండా డోర్ కర్టన్ వేయాలి.

● ఇంట్లో మనుషులు ఉన్నారని తలపించేలా ఇంటి ముందు, తలుపు ముందు చెప్పులు ఉంచాలి. ముందు గదిలో లైట్ వేసి ఉంచాలి.

● తాము ఊరికి వెళ్లే ముందే పేపర్ బాయ్, పాలు పోసే వాళ్లను కొరియర్, డెలివరీ బాయ్స్, కేబుల్ ఆపరేటర్లు, నీటి క్యాన్ల పంపిణీ దారులను అప్రమత్తం చేసి ఇంటికి రావద్దని చెప్పాలి.

● ఊరికి వెళ్లే ముందు తప్పనిసరిగా తమ నమ్మకస్తులకు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

● వాకిలి ఊడ్చే, ముగ్గులు వేసే, సమయంలో మెడలో బంగారు ఆభరణాలు ధరించవద్దు.

● అపరిచితులను ఇంట్లోకి రానివ్వొద్దు. వచ్చిన వ్యక్తులను గుర్తించగలిగితేనే డోరు తీయాలి. వీలైతే ఫోన్ ద్వారానే మాట్లాడి వెనక్కి పంపించాలి.

● తాము వెళ్లిన ఊరు కార్యక్రమాల ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదు.

● అనుమానాస్పద వ్యక్తులపై 100 టోల్ ఫ్రీ నెంబర్, పోలీస్ కంట్రోల్ రూం 8712662666, వాట్సాప్ నెంబర్ 8712662111కు డయల్ చేయాలి.

ముందు జాగ్రత్తలతో దొంగతనాలు అరికట్టొచ్చు



పండుగలు, ఇతర కార్యక్రమాల కోసం ఊర్లకు వెళ్లే వారు ముందు జాగ్రత్తలు తీసుకుంటే దొంగతనాలను నివారించవచ్చు. ఊరికి వెళ్తున్నట్లు సన్నిహితులకు మినహా ఎవరికీ చెప్పొద్దు. ఇళ్లలో పెద్ద మొత్తంలో నగదు బంగారం, తదితర విలువైన ఆభరణాలు ఉంచకూడదు. అధిక రోజులు ఊర్లలో ఉండాల్సి వస్తే తప్పనిసరిగా పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. సీసీ కెమెరాలు బిగించుకున్నవారు తమ సెల్‌ఫోన్లను తరుచుగా పరిశీలించుకోవాలి.

● ఎస్. సుధీర్‌కృష్ణ, భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్.

యాదగిరిక్షేత్రంలో శాస్త్రోక్తంగా నీరాటోత్సవాలు

ఆలయ తిరువీధుల్లో స్వామివారి సేవ

యాదగిరిగుట్ట, జనవరి 11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో గురువారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాలు, స్వామికి నిత్య పూజలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు పంచామృతాలతో స్వయంభువులను అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రధానాలయ ఉత్తర దిశలోని మొదటి ప్రాకార మండపంలో ఆండాళ్ అమ్మవారిని ఆరాధిస్తూ తిరుప్పావై పాశుర పఠనం చేశారు. హోమం, నిత్య తిరుకల్యాణోత్సవాలను నిర్వహించిన అర్చకులు ఆండాళ్ అమ్మవారిని పెళ్లి కూతురుగా, లక్ష్మీనృసింహుడిని రంగనాథుడిగా అలంకరించి తిరువీధి సేవోత్సవం నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదాదేవిని పెళ్లికూతురుగా అలంకరించి శ్రీరంగనాథుడిని చేరుకునే ఘట్టాలను యాదగిరిక్షేత్రంలో ఐదు రోజులపాటు నిర్వహిస్తారు. గోదా కల్యాణోత్సవంతో నీరాటోత్సవాలు పరిసమాప్తమవుతాయి. ధనుర్మాసపర్వాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీ రాత్రి 7గంటలకు గోదా కల్యాణం, 15న మధ్యాహ్నం ఒడి బియ్యం సమర్పణ ఘట్టాలు కొనసాగనున్నాయి.


లక్ష్మీనృసింహుల తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


సేవలను తిరువీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు

మార్చి 11 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఏక శిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు మార్చి 11న ఉదయం స్వస్తి పుణ్యాహవాచనం, విశ్వక్సేన పూజలతో సంప్రదాయరీతిలో శ్రీకారం చుట్టనున్నారు. మార్చి 12న ధ్వజారోహణం, 17న స్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం, 18న బ్రహ్మోత్సవ తిరుకల్యాణోత్సవం, 19న దివ్య విమాన రథోత్సవం, 20న చక్రతీర్థం, మహాపూర్ణాహుతి, 21న అష్టోత్తర శతఘటాభిషేక పూజలతో వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

చికిత్సపొందుతూ బాలుడు మృతి

ఆత్మకూరు(ఎం) జనవరి 11: చికిత్సపొందుతూ బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో జరిగింది. ఎస్.ఐ డి. నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వినయ్, సరస్వతీ దంపతులు తమ ముగ్గురు పిల్లలతో కలిసి మండలంలోని కొరటికల్ గ్రామ శివారులోని ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు రెండు నెలల క్రితం వచ్చారు. వారి చిన్న కుమారుడు వికాంత్(4) గత శనివారం ఆడుకుంటూ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. గురువారం వికాంత్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారకుల రిమాండ్

మాడ్గులపల్లి, జనవరి 11: వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన వారిని పోలీసులు అదుపులోకి రిమాండ్‌కు పంపారు. మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని గోగువారిగూడెం గ్రామానికి చెందిన సాధినేని గోవిందరావు(32)కు మిర్యాలగూడలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన శ్రీవిద్యతో 2022లో వివాహం జరిగింది. అప్పటి నుంచి గోవిందరావు అత్తగారింటి వద్ద ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, అత్త మామలు, బామ్మర్దితో తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో 2023 డిసెంబరు 28న పెద్దదేవులపల్లి గ్రామ శివారులోని పొలంలో పనిచేస్తుండగా భార్య శ్రీవిద్య, మామ యలమంద, అత్త లలిత, బామ్మర్ది వీరకృష్ణలు గోవింద రావుతో గొడవపడి కర్రలతో దాడి చేసి దూషించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గోవిందరావు అక్కడే ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడిని మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొం దుతూ మృతిచెందాడు. గోవిందరావు అన్న సాధినేని సైదారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. చల్లా యల మంద, చల్లా అనిత, చల్లా వీరకృష్ణ, సాధినేని శ్రీవిద్యలను మిర్యాలగూడలోని ఇందిరమ్మకాలనీలో అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం మిర్యాలగూడ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

● యాదాద్రిభువనగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు


చర్లగూడెం రిజర్వాయర్ కట్ట పనులు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మర్రిగూడ, జనవరి 11: చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన బాధిత భూ నిర్వాసితులకు మల్లన్నసాగర్ తరహాలోనే నష్టపరిహారం చెల్లించి రిజర్వాయర్ పనులు ప్రారంభించాలని యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పీవీ. శ్యాంసుందర్‌రావు డిమాండ్ చేశారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని చర్లగూడెం ప్రాజెక్టు కట్ట పనులను గురువారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, అసమర్థతతో రిజర్వాయర్ పనులు తొమ్మిది సంవత్సరాలైనా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి చేయలేదన్నారు. 2015లో చర్లగూడెం శంకుస్థాపన సందర్భంగా రెండు సంవత్సరాల్లోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రాజెక్టు కింద ఉన్న రెండు లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందిస్తానని ప్రజలకు ఇచ్చిన హామీ పూర్తిగా విఫలమైందన్నారు. అదేవిధంగా శంకుస్థాపన సందర్భంగా చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూనిర్వాసితులకు ముంపు గ్రామాల బాధిత నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, నష్ట భూపరిహారం, పునరావసం కల్పిస్తానని చెప్పినా నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకేపల్లి, వెంకేపల్లి తండాల్లోని కొంతమంది అర్హులైన బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం అందివ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మి అధికారం చేతులో పెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి 2013 భూసేకరణ చట్టం ప్రకారం మల్లన్నసాగర్ తరహాలోనే త్వరగా నష్టపరిహారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈ ప్రాజెక్టును పరిశీలించి భూ నిర్వాసితులకు పరిహారం అందేవిధంగా చూసి త్వరగా పనులు పూర్తి అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. అంతకు ముందు రిజర్వాయర్‌లో భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితుల సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శివన్నగూడ సర్పంచ్ చిట్యాల సబిత యాదగిరిరెడ్డి, బీజేపీ నాయకులు దాసరి మల్లేష్, కర్నాటి ధనుంజేరెడ్డి, పిట్టల అశోక్, పిట్టల శ్రీనివాస్, యాస అమరేందర్‌రెడ్డి, రాజేందర్‌నాయక్, రాజు, పరమేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి

అర్వపల్లి, జనవరి 11: విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతిచెందాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కొత్తగూడెం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మేడిపల్లి చిన్ననర్సయ్య శీలం నగేష్, తాడూరి మల్లయ్య, గడ్డ అచ్చాలుకు చెందిన పాడి గేదెలు మూసీ పరివాహక ప్రాంతంలో వ్యవసాయ పొలంలో మేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి నాలుగు అక్కడికక్కడే మృతిచెందాయి. గేదెల విలువ సుమారు రూ.2లక్షల ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

మోటకొండూరు, జనవరి 11: గ్రామాలను పరిశుభ్రం చేసే పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 29న హైదరాబాద్ నిర్వహించే పోరుగర్జన కరపత్రాన్ని యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలకేంద్రంలో పారిశుధ్య కార్మికులతో కలిసి గురువారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సంవత్సరాలుగా గ్రామాల్లోని రోడ్లను ఊడ్చి, వ్యర్థాలను ఎత్తిపోసి చాలీచాలని జీతాలతో బతుకుతున్నారన్నారు. అన్ని ఉద్యోగాలకు ఇతర కులాల వారు పోటీ పడతారు కానీ, గ్రామాలను శుభ్రం చేసే వద్ద దళితులు మాత్రమే ఉంటారని తెలిపారు. కారోనా కష్టకాలంలో తమ ప్రాణలు సైతం లెక్కచేయకుండా డాక్టర్లు, వైద్యసిబ్బందితో సమానంగా పారిశుధ్య కార్మికులు సేవాలు అందించాని గుర్తుచేశారు. ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లో నిర్వహించే పోరుగర్జన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లూరి మొగులయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది చంద్రమ్మ, ఎల్లమ్మ, యాదమ్మ, అరుణ, లలిత, వీరమ్మ, ఉపేంద్ర, బుగ్గ శ్రీశైలం, బోగారం వీరస్వామి, వంగపల్లి దయాకర్, బోగారం భిక్షపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ అవిష్కరిస్తున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

మద్యం మత్తులో బావిలోకి జారిపడి వ్యక్తి మృతి

మిర్యాలగూడ అర్బన్, జనవరి 11: మద్యం మత్తులో సెల్‌ఫోన్ కోసం వెతుకులాడుతూ సమీపంలోని ఊటబావిలోపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని జప్తీరప్పగూడెం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుంటిగొర్ల రమేష్(40) గ్రామశివారులోని ఓ పడావుపడ్డ ఊటబావి ఒడ్డున కూర్చొని మద్యం సేవిస్తున్నాడు. ఇదే సమయంలో ఫోన్‌కాల్ రావడంతో మాట్లాడి పక్కనే పెట్టుకున్న సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో వెతుకులాడే క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బావిలోకి జారి పడి మృత్యువాతపడ్డాడు. బావి పక్కనుంచి వ్యవసాయ పొలాల వద్దకు వెళ్తున్న కొందరు రైతులకు బావినీటిలో తేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రూరల్ సీఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడు గ్రామానికి చెందిన రమేష్‌గా గుర్తించారు. మృతదేహాన్ని స్థానికుల సహాయంలో బావిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. రమేష్‌కు భార్య, ఆరేళ్ల కుమార్తె ఉన్నారు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

ప్రయాణికుడిపై అద్దెబస్సు డ్రైవర్ దాడి

మిర్యాలగూడ అర్బన్, జనవరి 11: బస్సు ఎక్కేందుకు యత్నించిన ఓ ప్రయాణికుడిపై అద్దెబస్సు డ్రైవర్ దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ ఆర్టీసీ డిపో నుంచి టీఎస్05పీఏ 5193నెంబరుగల ఆర్టీసీ అద్దెబస్సు నల్లగొండకు బయలు దేరింది. పగిళ్ల వెంకన్న అనే వ్యక్తి తన స్వస్థలమైన నల్లగొండకు చేరుకునేందుకు పల్లెవెలుగు బస్సు ఎక్కి డ్రైవర్ వెనుక క్యాబిన్‌లో నిలుచునేందుకు ప్రయత్నించగా బస్సు డ్రైవర్ ఎస్‌కె. రజాక్ వాగ్వాదానికి దిగాడు. దీంతో ప్రయాణికుడు వెంకన్నతో బస్సు డ్రైవర్ ఘర్షణపడి కర్రతో దాడిచేశాడు దీంతో ప్రయాణికుడు వెంకన్న ముఖం భాగంలో గాయాలయ్యాయి. బాధిత ప్రయాణికుడు ఆర్టీసీ డీఎం తోపాటు స్థానిక టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నర్సింహారావు తెలిపారు.

తాటిచెట్టుపైనుంచి జారిపడి
గీతకార్మికుడికి గాయాలు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 11: తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గీతకార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో గురువారం జరిగింది. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు నర్సింగుల సోమయ్య ఉదయం తాటిచెట్టు ఎక్కేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో సోమయ్య తలభాగంలో గాయాలయ్యాయి.

దవడ ఎముకలకు విరిగిపోగా కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స నిర్వహిస్తున్నారు. గీతకార్మికుడి ఆరోగ్యపరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

శ్రీనివాసపురంలో యువతి అదృశ్యం

హుజూర్‌నగర్, జనవరి 11: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని శ్రీనివాసపురంలో యువతి అదృశ్యమైంది. ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోసుల లింగయ్య చిన్నకుమార్తె మహాలక్ష్మీ(22) ఈ నెల 10వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి మహాలక్ష్మీ ఇంట్లో కనిపించకపోవడంతో బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మహాలక్ష్మీ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

14 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

గరిడేపల్లి, జనవరి 11: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో నిల్వ ఉంచిన 14 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పి. వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన ముత్యాల కృష్ణమూర్తి ఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు ఆ ఇంటిపై పోలీసులు దాడి చేశారు. ఇంట్లో ఉన్న 14 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముత్యాల కిష్ణమూర్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది శ్రీకాంత్, జుబేర్‌పాషా పాల్గొన్నారు.

మోటర్లు ధ్వంసం చేసిన 11మందిపై కేసు

మఠంపల్లి, జనవరి 11: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని పెదవీడు గ్రామంలోని పొలంలో ఉన్న మోటర్లను ధ్వంసం చేసిన 11మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 540లో అమరేశ్వరి సిమెంట్ పరిశ్రమ సమీపంలో రామచంద్రాపురంతండా సర్పంచ్ రూపావత్ కృష్ణనాయక్‌కు చెందిన మూడు ఎకరాల్లో వరి పొలం సాగు చేస్తున్నాడు. పెదవీడు గ్రామానికి చెందిన సయ్యద్ కరీంతో పాటు అతని అనుచరులు మరో 10మంది పొలంలో ప్రవేశించి రెండు వ్యవసాయ మోటర్లు, పైపులను ధ్వంసం చేశారు. సర్పంచ్ కృష్ణనాయక్ తల్లి భూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లక్షల కోట్లతో చేసిన అభివృద్ధి శూన్యం



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీరేశం

చిట్యాల, జనవరి 11: గత ప్రభుత్వం పదేళ్లలో ఆరున్నర లక్షల కోట్లు అప్పు చేసి చేసిన అభివృద్ధి శూన్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విమర్శించారు. గురువారం చిట్యాలలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పాలకులు బాధ్యత లేకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజల సొమ్మును దుబారా చేశారని ఆరోపించారు. తెలంగాణ పునర్నిర్మాణం పేరుతో వ్యవస్థలను విధ్వంసం చేశారని ఆరోపించారు. డబ్బులు లేకున్నా ప్రజలను మభ్యపెట్టడానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కొబ్బరికాయలు కొట్టారని విమర్శించారు. ధ్వంసమైన వ్యవస్థలను కాపాడుకోవడానికి మనందరం పనిచేయాలన్నారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేశామని, మరో పది రోజుల్లో రూ.500లకు గ్యాస్ పథకం, ఉచితగృహ విద్యుత్ పథకం అమలుచేయనున్నట్లు తెలిపారు. వంద రోజుల్లో అన్ని పథకాలను అమలుచేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని 73మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెల్ల లింగస్వామి, జడ్పీటీసీ సుంకరి ధనమ్మ, కౌన్సిలర్లు జడల పూలమ్మ, కోనేటి కృష్ణ, బెల్లి సత్తయ్య, తహసీల్దార్ దశరథ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి : అబ్బగోని



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్‌గౌడ్

రామగిరి, జనవరి 11: పట్టణంలో పారిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మునిసిపల్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో పారిశుధ్య జవాన్లు, కార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అలీ, కౌన్సిల్ ఖయ్యూమ్‌బేగ్ తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరాలనుసద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టౌన్: వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ఖాన్ నిసార్ ఆసుపత్రిలో గురువారం వైద్యశిబిరాన్ని ఆయన తిప్పర్తి జడ్పీటీసీ రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. కేర్ హాస్పటల్ నాంపల్లి, హైదరాబాద్ బృందం డాక్టర్ జాహిద్, కె.ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ హెడ్ మహమ్మద్ అష్ఫాక్ దాదాపు 100 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహ్మద్ అమీర్‌అలీ, మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎ.ఎ.ఖాన్, అధ్యక్షుడు, ఇంజనీర్ యంఎ.అజీజ్, సభ్యులు పాల్గొన్నారు.

డప్పు,చెప్పు వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలి

నల్లగొండటౌన్, జనవరి 11: డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మారపాక నరేందర్ మాదిగ డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 29వ తేదీన ఇందిరాపార్కు వద్ద పోరుగర్జన సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోరుగర్జనకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. గురువారం పట్టణంలోని బాబుజగ్జీవన్‌రాం విగ్రహం వద్ద సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన రెండు డిమాండ్ల సాధన కోసం డప్పు, చెప్పు వృత్తిదారులు, పారిశుధ్య కార్మికులు, మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నకిరేకంటి అంజయ్యమాదిగ, నాయకులు యాదగిరిమాదిగ, సైదులుమాదిగ, యేసుమాదిగ, లక్ష్మణ్‌మాదిగ, శాంత్‌కుమార్ మాదిగ, విద్యార్థులు పాల్గొన్నారు

వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్‌గా రఘుమారెడ్డి



రఘుమారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చిట్యాలరూరల్, జనవరి 11: చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా ఏనుగు రఘుమారెడ్డి గురువారం ఎన్నికయ్యారు. వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షంపై డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టగా ఈ నెల 10వ తేదీన డీసీవో కిరణ్‌కుమార్ నిర్వహించిన సమావేశంలో 11ఓట్లతో నెగ్గడంతో ఆయన పదవిని కోల్పోయారు. చైర్మన్‌ను ఎన్నుకునేందుకు గురువారం పీఏసీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. చైర్మన్ స్థానానికి ఏనుగు రఘుమారెడ్డి నామినేషన్ దాఖలు చేయగా మరెవరు వేయలేదు. దీంతో ఆయన ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నికయ్యారు. రికార్డుల్లో చైర్మన్‌గా ఎన్నికైన రఘుమారెడ్డి, డైరెక్టర్లతో డీసీవో సంతకాలు చేయించారు. నూతన చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఎన్నిక పూర్తికాగానే కార్యాలయం నుంచి చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లు బయటకు రాగానే కాంగ్రెస్ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, సర్పంచులు దేశబోయిన మల్లమ్మపాపయ్య, సామిడి మోహన్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, వీరేశం, లింగస్వామితో పాటు నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన ఏనుగు రఘుమారెడ్డి, వైస్‌చైర్మన్, డైరెక్టర్లను ఎమ్మెల్యే వేముల వీరేశం సన్మానించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం

నల్లగొండరూరల్, జనవరి 11: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐటీయూసీ ఏర్పడిన నాటి నుంచి కార్మికుల సమస్యపై రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు మరింత తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలు మార్చుతూ కేంద్రం కార్మికులను మోసం చేస్తుందని అన్నారు. బీజేపీ పాలనలో కార్మికులు ఉపాధి కోల్పోయి దేశంలో నిరుద్యోగం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దొనకొండ వెంకటేశ్వర్లు, డివిజన్ కార్యదర్శి లెనిన్, వెంకటయ్య, జాని, శ్రీను, మదార్, యాదయ్య పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి

జిల్లా వ్యాప్తంగా గురువారం పలు పాఠశాలల్లో ముందస్తుగా సంక్రాంతి సంబురాలను నిర్వహించారు. విద్యార్థినులను ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. విద్యార్థులకు భోగి పండ్లు పోశారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు కావడంతో సంక్రాంతి సంబురాలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



చండూరు : సన్‌షైన్ పాఠశాలలో ముగ్గులు వేసిన విద్యార్థులు



చండూరు: గాంధీజీ పాఠశాలలో హరిదాసు వేషధారణ



హాలియా : మోదీ వేషధారణలో ప్రతిభ కనబరిచి బహుమతి అందుకుంటున్న విద్యార్థి కారంపూడి నాగశ్రీకాంత్‌రాజు



హాలియా: సీతారామ, లక్ష్మణ వేషధారణలో విద్యార్థులు



హాలియా: టైం పాఠశాలలో సంక్రాతి సంబురాలు



పీఏపల్లి: ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



ముగ్గుతో చిన్నారులు



నల్లగొండలో...



మల్లేపల్లిలో చిన్నారులు



మిర్యాలగూడ: ఉత్సాహంగా ముగ్గులు వేస్తున్న లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు



నల్లగొండలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



నాగార్జునసాగర్: పాఠశాలలో రగంవల్లులు వేస్తున్న విద్యార్థులు



నల్లగొండలో ముగ్గులు వేసిన చిన్నారులు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి : బాలునాయక్



అవుట్‌డోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 11: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండలో గురువారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో మాతృనాయక్, సామ్యనాయక్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర నాయకులు చందర్‌నాయక్, ధర్మ పాల్గొన్నారు.

● క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. దేవరకొండలో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి అవుట్‌డోర్ స్టేడియాన్ని సందర్శించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించి ఈ ప్రాంతానికి గుర్తింపు తేవాలన్నారు. క్రీడాకారులకు తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. దేవరకొండలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న జర్నలిస్టు కర్నాటి సైదులును ఆయన పరామర్శించారు. జర్నలిస్టులకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆయన వెంట దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జాన్‌యాదవ్, పంచాయతీరాజ్ డీఈ లింగారెడ్డి, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, సిరాజ్‌ఖాన్, హరికృష్ణ, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

● డిండి: మండలంలోని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు జవహర్‌లాల్‌నాయక్ ఎమ్మెల్యే బాలునాయక్‌ను కోరారు. ఎమ్మెల్యేకు ఆయన వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ జీపీ కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట వేంకటేశ్వరరావు, రాజేష్‌రెడ్డి, లక్‌పతినాయక్ తదితరులు ఉన్నారు.

నార్కట్‌పల్లిని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతాం

● జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం



సన్మానం పొందిన సర్పంచులతో జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

నార్కట్‌పల్లి, జనవరి 11: నార్కట్‌పల్లి పట్టణాన్ని నియోజకవర్గంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. రూ.5లక్షల జడ్పీ నిధులతో 13వ వార్డులో వేయనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇప్పటికే కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులతో పాటు పంచాయతీ పరిధిలో ప్రజలకు మౌలిక వసతులను కల్పిస్తామన్నారు.

ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలి

మండలంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ నరేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. సమావేశంలో వివిధ శాఖలపై చర్చలో భాగంగా రెవెన్యూ శాఖపై సమీక్ష జరుగుతున్న సమయంలో నార్కట్‌పల్లి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించారని ఆరోపించారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ స్పందిస్తూ అధికారాన్ని....అధికారులను అడ్డం పెట్టుకుని గతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం మండలంలో విద్యుత్ స్తంభాలు, మిషన్ భగీరథ నీటిని సరఫరా, బెల్టు షాపులు గురించి చర్చించారు. ఈ నెలాఖరుతో పదవీకాలం పూర్తి చేసుకుంటున్న సర్పంచులను ఎమ్మెల్యే, జడ్పీచైర్మన్లు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి మల్లయ్య, ఎంపీడీవో యాదగిరి, వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధి పనులపై సమీక్ష



ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, జనవరి 11: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఉన్న గ్రామాలు, మునిసిపాలిటీల అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులపై గురువారం ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి సాగర్ హిల్‌కాలనీలో ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో అంతర్గత రోడ్లు అద్దంలా ఉండాలని, రోడ్లు లేని గ్రామాలను, మునిసిపాలిటీలను గుర్తించి రోడ్లు వేయించడానికి అంచనాలు తయారుచేయాలని ఇంజనీర్లకు సూచించారు. కార్యక్రమంలో సీఎల్పీ మాజీ నేత కుం దూరు జానారెడ్డి, ఇంజనీర్లు రామమూర్తి, రామకృష్ణ, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సాయిప్రసాద్, సైదులు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డిని కలిసిన రంజిత్‌యాదవ్



రామచంద్రారెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న రంజిత్‌యాదవ్

హాలియా, జనవరి 11: బీజేపీ నల్లగొండ పార్లమెంట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి చింతల రామచంద్రారెడ్డిని హాలియాకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, నాయకులు చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, నల్లగొండ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

నల్లగొండరూరల్, జనవరి 11: రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి అధ్యక్షురాలు డాక్టర్ అనితరాణి అన్నారు. నల్లగొండ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో గురువారం ఐఎంఏ నీలగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అత్యవసర సమయాల్లో రోగులకు రక్తం అందక అనేక మంది మృతి చెందుతున్నారని, అందుకు ఆరోగ్యంగా ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని కోరారు. ఈ శిబిరంలో 54 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని ప్రతీ ఆస్పత్రిలో ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అధ్యక్షుడు గోలి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గవర్నర్ తమిళసై సూచనల మేరకు మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 60ఏళ్లు పైబడిన వృద్ధులకు, వారి యొక్క ఆరోగ్య పరిస్థితిని పరీక్షించినట్లు తెలిపారు. అంతేకాక వారికి కావాల్సిన విటమిన్లు కాల్షియం, బీ కాంప్లెక్స్ టాబ్లెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ నీలగిరి కార్యదర్శి డాక్టర్ రమేష్, కోశాధికారి ప్రవీణ్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఎస్ మూర్తి, డాక్టర్లు విశ్వజ్యోతి, విజయ్, సుబ్బారావు, ప్రశాంత్‌రెడ్డి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశానికి, ఏడు నుంచి పదో తరగతి వరకు మిగిలిన సీట్లకు ఈ నెల 12వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.రాగిణి కోరారు. ఫిబ్రవరి 22 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన ఉంటుందని పేర్కొన్నారు.

● శాలిగౌరారం మండలం మాదారంలోని టీఆర్‌ఆర్ కాటన్ మిల్‌లో సీసీఐ కేంద్రం సంక్రాంతి సందర్భంగా శుక్రవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు కొనుగోళ్లు బంద్ చేస్తున్నట్లు శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇస్లావత్ చీనానాయక్ తెలిపారు. తిరిగి కొనుగోళ్లను ఈ నెల 17వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో దూరవిద్య డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని స్టడీసెంటర్ కోఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య కోరారు. 2023-24 విద్యాసంవత్సరానికిగాను బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఇంటర్ లేదా తత్సమానమైన విద్యను పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ప్రవేశం పొందాలని కోరారు. ఇతర వివరాలకు 7382929640 నెంబరులో సంప్రదించాలన్నారు.

మిర్యాలగూడ టౌన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని మహారాష్ట్రలో నిర్వహించనున్న జాతీయ యువజన ఉత్సవాలకు పట్టణ యువకుడు నేరెళ్ల అజయ్ ఆహ్వానం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని నాసిక్‌లో ఐదు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు ప్రధాని మోదీ హాజరుకానున్నట్లు తెలిపారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలోని ఎల్లాపురంతండాకు చెందిన సీపీఎం మండల మాజీ కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ గురువారం నాగార్జునసాగర్‌లో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

మిర్యాలగూడ: కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న నూతన జాతీయ విద్యావిధానం ప్రగతి నిరోధకమని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్వాలా వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ రాష్ట్ర బాధ్యుడు ఇందూర్ సాగర్ అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న భాస్కర్

త్రిపురారం: నిరుపేదలకు కష్టాల్లో అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండా భాస్కర్ అన్నారు. కంపసాగర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఎల్లమ్మ కుటుంబానికి రూ.5 వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని ఆయన గురువారం అందజేశారు. సేవా దృక్పథంతో ఆయన గ్రామంలో పలువురికి ఆర్థికసాయం అందజేయడంపై గ్రామస్థులు అభినందించారు.

నల్లగొండ టౌన్: టాప్రా సౌజన్యంతో మాక్స్ విజన్ శ్రీమహాలక్ష్మి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లాలోని పెన్షనర్లకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్ చంద్ర, శ్యాంసుందర్ తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: బీసీలకు ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

కనగల్: నల్లగొండ జిల్లా తాగు సాగునీటి అవసరాల నిమిత్తం తక్షణమే ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు సాగర్ నీటిని విడుదల చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి కోరారు.

కొండమల్లేపల్లి: మండలకేంద్రంలోని అర్తగిరి క్షేత్రం (మల్లెల గట్టు) లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 12న కూడార్తై ఉత్సవం నిర్వహించనున్నారు. అలాగే ఈనెల 14న గోదా రంగనాధుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కుంభం సునీతమనోహర్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ నజీర్ మృతి



కుటుంబసభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఇన్‌సెట్‌లో మృతుడు (నజీర్)

హాలియా, జనవరి 11: హాలియా మునిసిపాలిటీలోని 2వ వార్డు అలీనగర్‌కు చెందిన మహ్మద్ నజీర్ (38) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. నల్లగొండ పట్టణంలోని విధులు నిర్వహిస్తున్న నజీర్‌కు హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్నాడు. ఉదయం అకస్మాతుగా గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒక వైపు కబడ్డీ క్రీడాకారుడిగా రాణించడంతో పాటు పోలీస్‌శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించి కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న నజీర్ ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అతని మృతదేహాన్ని స్వగ్రామం అలీనగర్ తీసుకువచ్చి అనంతరం పోలీస్ అధికారులతో గౌరవవందనం చేసి ఘనంగా నివాళులర్పించారు. సాయంత్రం కుటుంబ సభ్యులు, ఆప్తుల మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. నజీర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ: కబడ్డీ క్రీడాకారుడు, పోలీస్ కానిస్టేబుల్ అయిన నజీర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి వెంట పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు యడవల్లి నరేందర్‌రెడ్డి, ప్రభాకర్, జూపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.